కమల వికాసం ఇలా..!

- తొలిసారి బీజేపీ అభ్యర్థి విజయం
- త్రిముఖ పోరుతో లాభం
- ఫలితాలపై పోస్టుమార్టం



కౌటాల: సిర్పూర్ నియోజకవర్గంలో కమలం వికసించింది. ఇక్కడి నుంచి మొదటిసారిగా బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు గెలుపొంది బీజేపీ జెండా ఎగురవేశారు. హేమాహేమీలు తలపడ్డ పోరులో బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప రెండో స్థానంలో నిలవగా, బీఎస్పీ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మూడో స్థానంతో సరిపెట్టుకున్నారు.

ఫలితాలపై సమీక్ష..

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో గెలుపు, ఓటములపై అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు దృష్టి సారించి ఫలితాలను విశ్లేషిస్తున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా పోలైన ఓట్ల లిస్ట్ రావడంతో ఓట్ల సరళి పరిశీలిస్తున్నారు. ఎక్కడ లోటు ఏర్పడింది. ఎక్కడ మెజారిటీ వచ్చింది. ఏఏ కారణాలతో ఓట్లు రాబట్టుకోలేక పోయాం.. అనే అంశాలపై చర్చించుకుంటున్నారు. ఓట్లు తక్కువ రావడానికి కారణాలేమిటో తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

హోరాహోరీ పోరు

సిర్పూర్ నియోజకవర్గంలో 1952 నుంచి ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ సారి ఎన్నికలు హోరాహోరీగా సాగాయి. బీఎస్పీ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇక్కడి నుంచి పోటీ చేశారు. దీంతో రాష్ట్ర ప్రజల దృష్టంతా ఈ నియోజకవర్గంపై పడింది. ఈ ఎన్నికల్లో ప్రవీణ్‌కుమార్ 44,646 ఓట్లు సాధించి మూడో స్థానంతో సరిపెట్టుకున్నారు. బీఎస్పీకి పూర్తిస్థాయిలో క్యాడర్ లేకపోవడం, ఓ సామాజిక వర్గం మాత్రమే ఆయన వైపు మొగ్గుచూపడంతో ఓటమి చవిచూశారు. బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప ప్రజల్లో ఉంటారని, సేవ కార్యక్రమాలు చేస్తారనే మంచి పేరు ఉంది. ఈసారి గెలిచి హ్యాట్రిక్ సాధిస్తారని అందరూ భావించారు. కానీ 60,614 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు. ఆయా మండలాల్లో క్యాడర్ వ్యవహారశైలి కారణంగానే కోనప్ప విజయం సాధించలేదని పలువురు పేర్కొంటున్నారు.

బీజేపీ తొలిసారి..

ఈ ఎన్నికల్లో మొదటి నుంచి బీఎస్పీ, బీఆర్ఎస్ ప్రధాన ప్రత్యర్థులుగా ఉంటారని అందరూ భావించారు. ఎన్నికల ప్రచారాల్లో సైతం ఇరు పార్టీల అభ్యర్థులు ఒకరిపై ఒకరు తీవ్రమైన ఆరోపణలు చేసుకున్నారు. కానీ ఎన్నికల్లో అనుహ్యంగా బీఆర్ఎస్, బీఎస్పీలకు షాక్ ఇస్తూ కమలం వికసించింది. బీజేపీ అభ్యర్థి డోర్ టూ డోర్ సైలెంట్‌గా ప్రచారం చేస్తూ పక్కా ప్రణాళికతో ముందుకెళ్లి విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు 63,702 ఓట్లు సాధించి బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్పపై 3,088 ఓట్ల స్వల్ప మెజార్టీతో గెలిచారు. స్వల్ప మెజార్టీతో బీజేపీ గెలవడంతో కొద్దిగా కష్టపడితే బాగుండేదని బీఆర్ఎస్ నాయకులు ప్రస్తుతం మదనపడుతున్నారు.

సిర్పూర్ నియోజకవర్గం ఎమ్మెల్యేలు..

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ
1952	ఎమ్.బుచ్చయ్య	సోషలిస్టు
1957	కె.రాజమల్లు	పి.ఎస్.పి
	(ద్వి) వెంకటస్వామి	కాంగ్రెస్
1962	జి.సంజీవరెడ్డి	కాంగ్రెస్
1967	జి.సంజీవరెడ్డి	కాంగ్రెస్
1972	కె.వి. కేశవులు	కాంగ్రెస్
1978	కె.వి. కేశవులు	కాంగ్రెస్
1983	కె.వి.నారాయణరావు	టీడీపీ
1985	కె.వి.నారాయణరావు	టీడీపీ
1989	పి.పురుషోత్తంరావు	ఇండిపెండెంట్
1994	పి. పురుషోత్తంరావు	ఇండిపెండెంట్
1999	పి.రాజ్యలక్ష్మి	టీడీపీ
2004	కోనేరు కోనప్ప	కాంగ్రెస్ ఐ
2009	కావేటి సమ్మయ్య	టీఆర్ఎస్
2010	కావేటి సమ్మయ్య	టీఆర్ఎస్
2014	కోనేరు కోనప్ప	బీఎస్పీ
2018	కోనేరు కోనప్ప	టీఆర్ఎస్
2023	పాల్వాయి హరీశ్‌బాబు	బీజేపీ

మండలాల వారీగా ఓట్లు..

- కాగజ్‌నగర్ పట్టణంలో బీఎస్పీ ఆధిక్యత చాటుకుంది. ఆ పార్టీకి 12,150 ఓట్లు వచ్చాయి. బీఎస్పీకి మైనార్టీ, ఎస్సీ వర్గం ఓట్లు పడ్డాయి. అలాగే బీఆర్ఎస్‌కు 9,598 ఓట్లు పడ్డాయి. బీజేపీకి 8,676 ఓట్లు వచ్చాయి.
- కాగజ్‌నగర్ మండలంలో బీజేపీకి బాగా కలిసొచ్చింది. బెంగాలీలు గంపగుత్తగా బీజేపీకి ఓట్లు వేయడంతో ఆ పార్టీకి 15,203 ఓట్లు వచ్చాయి. బెంగాలీల ఓట్లే బీజేపీ గెలుపునకు ప్రధాన భూమిక పోషించాయి. బీఆర్ఎస్‌కు 10,205 ఓట్లు రాగా, బీఎస్పీకి 7,809 ఓట్లు పడ్డాయి.
- సిర్పూర్(టి) మండలంలో బీజేపీ ఆధిక్యత కనబర్చింది. బీజేపీకి 6,236 ఓట్లు రాగా, స్థానిక నాయకులపై వ్యతిరేకత కారణంగా బీఆర్ఎస్‌కు 5,968 ఓట్లు పడ్డాయి. బీఎస్పీకి 4,522 మంది ఓట్లు వేశారు.
- కౌటాల మండలంలో ఎస్సీల జనాభా ఎక్కువగా ఉండడంతో బీఎస్పీకి అధికంగా ఓట్లు వస్తాయని భావించారు. కానీ అధికార బీఆర్ఎస్‌కు అధికంగా 7,247 ఓట్లు వచ్చాయి. బీజేపీకి 6,838 ఓట్లు రాగా, బీఎస్పీకి 6,007 ఓట్లతో మూడో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.
- చింతలమానెపల్లి మండలంలో స్థానిక నాయకులపై ఉన్న వ్యతిరేకత కారణంగా అధికార పార్టీకి ఆశించిన స్థాయిలో ఓట్లు రాలేదు. బీజేపీకి 7,704 ఓట్లు రాగా, బీఆర్ఎస్‌కు 7,098, బీఎస్పీకి 4,057 ఓట్లు వచ్చాయి.
- బెజ్జూర్ మండలంలో బీఆర్ఎస్ తన ఆధిక్యత చాటింది. బీఆర్ఎస్‌కు 6,820 ఓట్లు, బీజేపీకి 6,236, బీఎస్పీకి 4,393 ఓట్లు వచ్చాయి.
- పెంచికల్‌పేట్ మండలంలో బీఆర్ఎస్‌కు మెజార్టీ ఓట్లు పడ్డాయి. బీఆర్ఎస్‌కు 5,056 ఓట్లు వచ్చాయి. బీజేపీకి 3,173 ఓట్లు రాగా బీఎస్పీకి 2,223 మంది ఓట్లు వేశారు.
- దహెగాంలో బీజేపీకి కలిసొచ్చింది. ఆ పార్టీకి ఈ మండలంలో మెజార్టీ వచ్చింది. బీజేపీకి 9,295 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్‌కు 8,102 ఓట్లు రాగా, బీఎస్పీకి కేవలం 3,288 ఓట్లు మాత్రమే వచ్చాయి.

క్లుప్తంగా

దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ప్రకాశ్

పెంచికల్‌పేట్: మండలంలోని బొంబాయిగూడ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త చపిడే ప్రకాశ్ గ్రామంలోని 50 మంది నిరుపేదలకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు చేయూత అందించేందుకు ఏటా దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు చౌదరి గుండయ్య, తోరె బాపురావు, గంగారాం, బుచ్చులు, వెంకటేష్, ఇస్తారి, మల్లేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి సభ్యత్వ నమోదు

ఆసిఫాబాద్‌రూరల్: పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పద్మశాలీల కుటుంబ వివరాలు, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమానికి పద్మశాలీలు సహకరించి వివరాలు అందజేయాలని కోరారు.

గ్రామాల్లో కొనసాగుతున్న సామాజిక తనిఖీ

జైనూర్: ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ జరుగుతుందని ఏపీవో నగేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఆయా గ్రామపంచాయతీల్లో సామాజిక బృందం కమిటీ సభ్యులు గ్రామసభలు నిర్వహించి పనుల వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరిగిన పనులను గుర్తింపు సంఖ్యల ఆధారంగా తెలుసుకుంటున్నారు. అన్ని గ్రామపంచాయతీల వారీగా సామాజిక తనిఖీ పూర్తయ్యాక మండల కేంద్రంలో ప్రజా వేదిక నిర్వహించి డీఆర్‌పీలు వివరాలు వెల్లడించనున్నట్లు ఆయన తెలిపారు.

కనకదుర్గాదేవీ ఆలయంలో పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న మహిళలు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని భక్తులతో పాటు పలు గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు కనకదుర్గాదేవితో పాటు స్వయంభూ మహంకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. తలనీలాలు, పట్టు వస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించి నైవేద్యాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కోనేరు కృష్ణారావుకు సన్మానం



కోనేరు కృష్ణారావును సన్మానిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్‌గా ఎన్నికైన కోనేరు కృష్ణారావును కాగజ్‌నగర్ పట్టణం కాపువాడకు చెందిన మైనారిటీ నాయకులు సన్మానించారు. ఆదివారం పట్టణంలో ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు.

అసంపూర్తిగా క్రీడా మైదానం

నార్నూర్: మండల కేంద్రంలోని ఏకలవ్య ఆదర్శ పాఠశాల విద్యార్థుల కోసం రెండేళ్ల క్రితం హ్యాండ్ బాల్‌కోర్ట్, సీసీరోడ్డు, డ్రెయినేజీ, క్రీడా మైదానం, ఇతర మరమ్మతుల పనుల కోసం ప్రభుత్వం కోటి రూపాయలు మంజూరు చేసింది. రెండేళ్లుగా పనులు నత్తనడకన సాగుతుండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. సరైన క్రీడా మైదానం లేక క్రీడల్లో రాణించలేకపోతున్నామని వారు వాపోతున్నారు. పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత శాఖ అధికారులు స్పందించి పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఈ విషయమై ఐటీడీఏ జేఈ సునీల్ రాథోడ్‌ను వివరణ కోరగా బిల్లులు పెండింగ్‌లో ఉండడం వలన పనుల్లో జాప్యం జరుగుతుందన్నారు.

విగ్రహ ప్రతిష్టాపన

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేటలో ఈనెల 14న రేణుకా ఎల్లమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఉందని సర్పంచ్ బుర్ర రాకేశ్‌గౌడ్ తెలిపారు. 12న గణపతి పూజ, 13న నిత్య పూజ, మూల మంత్రహవనాలు ఉంటాయని పేర్కొన్నారు.

ఖాళీ స్థలం.. చెత్తమయం!

- పాత కూరగాయల మార్కెట్‌లో పేరుకున్న చెత్త
- దుర్గంధంతో ప్రజల ఇబ్బందులు
- షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్



ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్తాచెదారం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని పాత కూరగాయల మార్కెట్ స్థలంలో చెత్తాచెదారం పడేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతుంది. జిల్లా కేంద్రంలో ప్రజా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో చుట్టుపక్కల షాపుల్లో పని చేసే వారు ఈ ఖాళీ స్థలంలోనే పని కానిస్తున్నారు. దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది సమీపంలో నివాసం ఉంటున్న వారు ఇబ్బందులు పడుతున్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి డిమాండ్..

పాత కూరగాయల మార్కెట్‌ను జూబ్లీ మార్కెట్‌కు తరలించడంతో రెండేళ్లుగా పాత కూరగాయల మార్కెట్ స్థలం ఖాళీగానే దర్శనమిస్తుంది. ఇక్కడ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం పాత షెడ్లు తొలగించి రెండేళ్లు గడుస్తున్నా నేటి వరకు పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో ఖాళీ స్థలంలో చుట్టుపక్కల వారు చెత్తాచెదారం పడేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతుంది. పాత కూరగాయల మార్కెట్ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. దీంతో చాలా మంది ఉపాధి పొందే అవకాశం ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు


జిల్లా కేంద్రంలోని బాపునగర్, కాసబ్‌వాడీ, సందీప్ నగర్, రాజంపేట్, టీఆర్‌నగర్‌తో పాటు చాలా చోట్ల ఖాళీ ప్లాట్లలో పిచ్చి మొక్కలు పెరిగి విషపురుగులు సంచరిస్తున్నాయి. రాత్రి వేళల్లో విష పురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్త, పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని జిల్లాకేంద్రం వాసులు కోరుతున్నారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయి. ఎన్నికల నేపథ్యంలో పనుల్లో జాప్యం జరిగింది. త్వరలో షాపింగ్ కాంప్లెక్స్ పనులు ప్రారంభిస్తాం.

– వంశీ, పంచాయతీ కార్యదర్శి

చెత్తాచెదారం లేకుండా చూడాలి



ఖాళీ స్థలం ఉండటంతో చెత్తాచెదారం వేస్తున్నారు. దీంతో దుర్గంధం వెదజల్లుతుంది. గ్రామ పంచాయతీ సిబ్బంది పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలి.

– బాపునగర్, స్థానికుడు

షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలి



పాత కూరగాయల మార్కెట్ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలి. దీంతో చాలా మందికి ఉపాధి దొరుకుతుంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ప్రహ్లాద్, లేడీస్ డ్రెస్సెస్ షాపు యజమాని

ఎమ్మెల్యేకు సన్మానం



హరీశ్‌బాబును సన్మానిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబును ఆరె కుల సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్‌లో గల ఎమ్మెల్యే నివాసంలో శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

'మానవ హక్కులను కాపాడాలి'



అవగాహన కల్పిస్తున్న మహ్మద్ తాజొద్దీన్

కాగజ్‌నగర్‌టౌన్: మానవ హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ తాజొద్దీన్ అన్నారు. 75వ మానవ హక్కుల అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవులు హక్కులతో పాటు పలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణవాసులకు చట్టాలపై అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చెరువు నిండా నీళ్లు.. బీళ్లుగా ఆయకట్టు



నిండుకుండలా రామారావుపేట పెద్దచెరువు



బీళ్లుగా చెరువు ఆయకట్టు సాగు

జైపూర్: మండలంలోని ఇందారం-రామారావుపేట పెద్ద చెరువు నీటితో కళకళలాడుతోంది. సుమారు వెయ్యి ఎకరాలకు పైగా ఆయకట్టు సాగు పచ్చదనం పర్చుకున్నట్లుగా కనిపించేది. కానీ మూడేళ్లుగా రైతులు పంటల సాగుకు దృష్టిపెట్టడం లేదు. వర్షాకాలంలో పెద్ద చెరువులోకి వర్షపు నీరు వస్తుండగా, మరో పక్కన శ్రీరాంపూర్ ఓసీపీ నీరు వచ్చి చేరుతోంది. ఓసీపీ నీళ్లతో పంటలు సాగు చేయక బీళ్లుగా మారుతున్నాయి. కొందరు రైతులు పంటల సాగుకు మొగ్గుచూపడం లేదు. దీంతో ఉపాధి కరువైతుందని కూలీలు వాపోతున్నారు.

కంపు..కంపు



భీమిని: మండలంలోని వీగాం పంచాయతీలో చెత్త నిర్వహణ సరిగా చేపట్టడం లేదు. భీరన్న ఆలయం సమీపంలో చెత్త డంప్ చేస్తున్నారు. భరించలేని దుర్గంధం రావడంతో భక్తులు ముక్కుమూసుకుంటున్నారు. పరిసరాల్లోని గృహాలకు సైతం ఇబ్బందిగా మారింది. పంచాయతీలో సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో కాలనీలన్నీ కంపుకొడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బడిలోనే బాలలు..!

- నేటి నుంచి పిల్లల గుర్తింపు సర్వే
- ఇంటింటికీ తిరగనున్న సీఆర్పీలు
- జిల్లాలో 67 క్లస్టర్లలో సర్వే



సర్వే నిర్వహిస్తున్న సీఆర్పీలు (ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్: 6 నుంచి 14 సంవత్సరాల బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించే విధంగా విద్యాశాఖ బడిబయట పిల్లల సర్వే చేపట్టింది. బడీడు పిల్లలు చదువుకోవాలనే లక్ష్యంతో బడి బయట పిల్లలను గుర్తించేందుకు ఈ నెల 11 నుంచి జనవరి 10 వరకు సీఆర్పీలు ఇంటింటి సర్వే చేపట్టనున్నారు.

ఇంటింటికీ సర్వే..

జిల్లాలో మొత్తం 1269 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో డీఈవో పరిధిలో 684 పాఠశాలలు ఉండగా, మిగతావి కేజీబీవీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ప్రైవేట్, బీసీ గురుకులాలు ఉన్నాయి. డీఈవో పరిధిలో 535 ప్రాథమిక పాఠశాలలు, 98 ప్రాథమికోన్నత పాఠశాలలు, 51 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. జిల్లాలో 67 క్లస్టర్లలో 53 మంది సీఆర్పీలు పని చేస్తున్నారు. వీరి పరిధిలోని క్లస్టర్‌లో ఇంటింటికి తిరిగి వివిధ కారణాలతో బడికి దూరంగా ఉన్న బడీడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పిస్తారు. 6 నుంచి 14 సంవత్సరాల పిల్లలు పాఠశాలలో, 15 నుంచి 19 సంవత్సరాల వారిని ఓపెన్ ఇంటర్ చదివించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. గత ఏడాది నిర్వహించిన సర్వేలో 148 మంది బడి బయట పిల్లలను గుర్తించి, 142 మందిని బడిలో చేర్పించి విద్య అందిస్తున్నారు. ఈ ఏడాది సైతం బడిబయట పిల్లలను గుర్తించేందుకు జిల్లా విద్యాశాఖ యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది.

బడిలో చేర్పించేలా అవగాహన..

వివిధ కారణాలతో బడికి దూరంగా ఉన్న వారిని గుర్తించి తల్లిదండ్రులకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా అవగాహన కల్పిస్తున్నారు. గుర్తించిన బడీడు పిల్లలను సార్వత్రిక పాఠశాలల్లో పది, ఇంటర్ విద్యలో చేర్పించనున్నారు. వృత్తి విద్యా కోర్సులపై ఆసక్తి ఉన్న వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. దీంతో పాటు వారికి ఆర్థికంగా ప్రోత్సహించేందుకు రూ.2వేలు అందించనున్నారు.

అందరినీ బడిలో చేర్పిస్తాం



బడి బయట పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. పిల్లలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. జనవరి 10లోపు సర్వే పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిస్తాం.

– ఉప్పులేటి శ్రీనివాస్, ఎస్‌వో

కంకర తేలి.. గుంతలు పడి!



కంకర తేలిన రోడ్డు

- అధ్వానంగా లేండిగూడ రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

కెరమెరి: తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు గ్రామాలకు వెళ్లే ప్రధాన లేండిగూడ రోడ్డు కంకర తేలి, గుంతలు పడి అధ్వానంగా మారింది. దీంతో లేండిగూడ, గౌరి, భోలాపటార్, అంతాపూర్, పద్మావతి, ఏసాపూర్, నారాయణగూడ తదితర గ్రామాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే మార్గంలో మహారాష్ట్రలోని జివితి, గడ్‌చందూర్, కొర్పానా తాలుకాలకు రాకపోకలు సాగిస్తుంటారు.

బండరాళ్లు తేలి..

కెలికే, లేండిగూడ మధ్యలో ఉన్న కల్వర్టు పూర్తిగా తెగిపోవడంతో పాటు రోడ్డంతా బండరాళ్లు తేలి వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉంది. సుమారు 200 మీటర్ల వరకు ఉన్న తారురోడ్డు ఆనవాళ్లు కోల్పోయింది. ఎక్కడికక్కడ కంకర తేలి, రాళ్లు రప్పలతో నిండి, అక్కడక్కడ గుంతలు పడి ప్రయాణం నరకప్రాయంగా మారింది. గతంలో బీటీ రోడ్డు వేసినా నిర్వహణ సరిగా లేకపోవడంతో రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుపై ఉన్న మూలమలుపుల కారణంగా తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



రోడ్డు అధ్వానంగా మారడంతో నడిచేందుకు కూడా చాలా ఇబ్బందులు పడుతున్నాం. వాహనాలు కంకర రాళ్లపై జారిపోతున్నాయి. కొత్తగా ఈ మార్గంలో వాహనం నడిపే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అధికారులు చొరవ తీసుకొని రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

– హడ్సే బాజీరావు, ఇంద్రానగర్

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా..



లేండిగూడ తదితర గ్రామాలకు వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి దృష్టికి తీసుకెళ్తా. రోడ్డు మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతాం. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

– వాగ్మారే శివాజి, సర్పంచ్, భోలాపటార్

'నేనింతే' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో కవులు, రచయితలు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలలో కవి రచయిత బోనగిరి రాజారెడ్డి రచించిన వచన కవితా సంపుటి నేనింతే పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్, కవులు, రచయితలు రాజేశం, అల్లం రాజయ్య, నారాయణ, వెంకటేశ్వర్లు, రమేశ్‌బాబు, సుబ్బాయమ్మ, వామన్‌రావు, నాగేంద్ర, శ్రీలక్ష్మి, మనోహర్‌రెడ్డిపాల్గొన్నారు.

నత్తనడకన పనులు



దండేపల్లి: మండల కేంద్రం నుంచి నర్సాపూర్ వెళ్లేందుకు గల బీటీ రోడ్డు శిథిలం కావడంతో దాని స్థానంలో కొత్తగా రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. గతరెండు నెలల క్రితం చేపట్టిన రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా కంకర పోసి వదిలేశారు. దీంతో వాహనదారులు, ప్రజలు నరకయాతన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పనులు ప్రారంభించి త్వరగా పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.